క్లుప్తంగా

గర్భిణులకు పోషక కిట్ల అందజేత


కిట్లను అందజేస్తున్న రాజిరెడ్డి తదితరులు

నర్సాపూర్: గర్భిణులకు మాతృదేవోభవ కిట్లను సోమవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి అందజేశారు. పోషకాహార లోపంతో గర్భిణులు బాధ పడొద్దన్న ఉద్దేశంతో నర్సాపూర్, నారాయణపూర్, లింగాపూర్, కాగజ్‌మద్దూర్, నత్నాయిపల్లి గ్రామాలలో ఈ కిట్లు అందజేసినట్లు ఆయన వివరించారు. ఆయన వెంట సొసైటీ చైర్మన్ రాజుయాదవ్, పార్టీ నాయకులు మల్లేష్, చిన్న ఆంజిగౌడ్, శ్రీనివాస్‌గుప్తా, ఉదయ్‌కుమార్, నగేష్, రవీందర్‌గౌడ్, రవికుమార్, రషీద్, సురేష్, లలిత, నగేష్ తదితరులు ఉన్నారు.

కొత్తపల్లి బ్రిడ్జి రోడ్డుకు మరమ్మతులు


కొత్తపల్లి రోడ్డు గుంతలు పూడ్చి వేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

పాపన్నపేట(మెదక్): 'కొత్తపల్లి రోడ్డు.. ప్రయాణం నరకం' శీర్షికన సాక్షిలో ఈ నెల 6న ప్రచురితమైన కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. గుంతలు పడిన రోడ్డును సోమవారం జేసీబీతో పూడ్చి వాహనాల ఇబ్బందులను తాత్కాలికంగా తీర్చారు. కానీ శాశ్వత రోడ్డు వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పొలాల్లోకి కెమికల్ వ్యర్థాలు

పాడవుతున్న పంటలు


వంకాయ పంటలోకి చేరిన కెమికల్ వ్యర్థాలు

శివ్వంపేట(నర్సాపూర్): కెమికల్ పరిశ్రమ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యర్థాలను బయటకు వదిలేస్తుండడంతో పచ్చని పంటలు పాడైపోతున్నాయి. మండల పరిధిలోని నవాబుపేట గ్రామ పరిధిలో ఉన్న ఓ కెమికల్ పరిశ్రమ బయటకు వదిలిన కెమికల్ వ్యర్థాల వల్ల సాగు చేస్తున్న వంకాయ పంటలోకి చేరి పంట పాడైపోయిందని రైతులు వాపోయారు. స్వాతి పరిశ్రమ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా కెమికల్ వ్యర్థాల బయటకు వదులుతున్నారని, దీంతో తాము నష్టపోవాల్సి వస్తుందని రైతులు భాస్కర్, రవిగౌడ్ అన్నారు. సంబంధిత పీసీబీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

మండల విద్యాధికారి విఠల్


విజేతగా నిలిచిన కబడ్డీ జట్టుతో ఎంఈఓ విఠల్, తదితరులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): క్రీడలు ఆడటంతోనే విద్యార్థుల్లో శారీరక, మానసిక ధృఢత్వం పెంపొందుతుందని మండల విద్యాధికారి విఠల్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని చిట్కుల్‌లో ఎస్‌జీఎఫ్ క్రీడల్లో భాగంగా చివరి రోజు ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విఠల్ మాట్లాడుతూ మండల విద్యార్థులు ఖో–ఖో, వాలీబాల్, కబడ్డీ పాల్గొని, తమ సత్తా చాటారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. క్రీడల ఆర్గనైజర్స్‌గా వ్యవహరించిన చిట్కుల్ పీడీ సుజాత, పీఈటీలు సత్యం, శేఖర్‌లను ఆయన అభినందించారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ

పెద్దశంకరంపేట(మెదక్): నారాయణఖేడ్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పెద్దశంకరంపేటలోని గ్రామపంచాయతీ కార్మికులకు సోమవారం దుస్తులను పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకులు దివంగత చోల్కర్ వెంకటరావు జ్ఞాపకార్థం ఆయన మనుమడు అరవింద్ చోల్కర్ కార్మికులకు దసరా పండుగను పురస్కరించుకొని దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీఓ జాకీర్ హుస్సేన్, గ్రామకార్యదర్శి వెంకటరాములు, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ రాజ్‌కుమార్, అధ్యక్షుడు సాయి సంగమేశ్వర్, సభ్యులు వెంకటరావు, ప్రభాకర్, పెంటయ్య, చరణ్ తదితరులు ఉన్నారు.

రోడ్డెక్కిన రైతులు

- యూరియా కోసం తప్పని తిప్పలు
- ఎక్కడ చూసినా బారులు
- ఆగ్రహంతో రాస్తారోకో, ధర్నాలు


శివ్వంపేటలో రోడ్డుపై బైఠాయించిన రైతులు

తూప్రాన్/చేగుంట(తూప్రాన్)/వెల్దుర్తి/శివ్వంపేట/పెద్దశంకరంపేట(మెదక్)/నర్సాపూర్: యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. బస్తా యూరియా కోసం గంటలకొద్దీ నిరీక్షించాల్సిం వస్తుంది. పొలాల్లో ఉండాల్సిన రైతులు.. ఎరువుల దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. చివరకు విసిగి వేసారడంతో రోడ్డెక్కుతున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. తూప్రాన్‌లో ఎరువుల దుకాణాల బారులు తీశారు. చేగుంటలో గాంధీ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. మాసాయిపేటలో జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. దీంతో ఇరువైపుల కిలోమీటరుకు పైగా వాహనాలు నిలిచిపోయాయి. శివ్వంపేటలో విసిగివేసారిన రైతులు తూప్రాన్- నర్సాపూర్ హైవే పై బైటాయించి రాస్తారోకో చేపట్టారు. పెద్దశంకరంపేటలో ఎరువుల దుకాణం వద్ద ఉదయం నుండే బారులు తీరారు. నర్సాపూర్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ రైతులతో కలసి జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

రామాయంపేట(మెదక్): రామాయంపేట సహకార సంఘం కార్యాలయం రైతులు ఎదుట బారులు తీరారు. గంటల తరబడి నిలబడే ఓపిక లేక పలువురు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.


నర్సాపూర్‌లో..


రామాయంపేటలో బారులు తీరిన రైతులు


పెద్దశంకరంపేటలో రైతుల బారులు


తూప్రాన్‌లో గుమిగూడిన రైతులు


చేగుంటలో రాస్తారోకో


మాసాయిపేటలో ధర్నా చేస్తున్న రైతులు

ఆయిల్‌పాంతో అధిక దిగుబడులు

ఏఓ రాం ప్రసాద్

టేక్మాల్(మెదక్): ఆయిల్‌పాం సాగుతో అధిక దిగుబడులను పొందవచ్చునని వ్యవసాయాధికారి రాం ప్రసాద్ తెలిపారు. సోమవారం టేక్మాల్ మండలం కుసంగి గ్రామంలో లచ్చన్నగారి మహిపాల్ రెడ్డి వ్యవసాయ భూమిలో పామ్‌ఆయిల్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ఆయిల్‌పాం సాగు చేస్తే అంతర పంటలు సాగు చేసుకోవచ్చని చెప్పారు. తక్కువ పెట్టుబడితో అధిక లాబాలు పొందవచ్చునని తెలిపారు. మాజీ జిల్లా కో ఆప్షన్ సయ్యద్ యూసుఫ్, ఏఈఓ ఇంద్రయ్య, ఆర్టికల్చర్ సిబ్బంది జాన్సన్, అశోక్ కుమార్ పాల్గొన్నారు.


ఆయిల్‌పాం మొక్కను నాటుతున్న అధికారులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొల్చారం(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్‌ఐ హైమద్ మోహినొద్దీన్ తెలిపిన వివరాలు... చిలప్ చెడ్ మండలం బద్రియా తండాకు చెందిన మెగావత్ టిక్యా(57) తన అల్లుడు ఐన విఠల్ స్ప్లెండర్ బైక్‌పై రంగంపేటకు పిండి పట్టించేందుకు బయలుదేరారు. మెదక్ జోగిపేట ప్రధాన రహదారి రంగంపేట గ్రామ శివారులో రంగంపేట నుంచి వస్తున్న ట్రాక్టర్ బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టిక్యా ఎగిరి రోడ్డుపై పడటంతో కుడి వైపు తలకు తీవ్ర గాయమైంది. విఠల్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. చికిత్స నిమిత్తం టిక్యాను గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు.

సిమెంట్ వ్యాపారుల సంఘం కార్యవర్గం

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట, టేక్మాల్ మండలాల సిమెంట్ వ్యాపారుల సంఘం ఎన్నికలు సోమవారం జరిగాయి. అధ్యక్షుడిగా సుగుణాకర్, ప్రధాన కార్యదర్శిగా బాబా, ఉపాధ్యక్షుడిగా సంతోష్,రవి, సంయుక్త కార్యదర్శిగా కృష్ణ, సలహాదారుడిగా యాదగిరి, కార్యవర్గ సభ్యులుగా విక్రంరాజు, సురేష్, శ్రవణ్, శేఖర్, ప్రవీణ్, సుబ్బారావు, శ్రీకాంత్, సురేష్, అజీజ్ ఎన్నికయ్యారు.


నూతన కార్యవర్గం

ఉపాధ్యాయులు సమాజ మార్గదర్శకులు

మాసాయిపేట ఎంఈఓ లీలావతి


ఉత్తమ ఉపాధ్యాయులుగా సన్మానం పొందిన ఉపాధ్యాయ బృందం

వెల్దుర్తి(తూప్రాన్): సమాజాన్ని మార్చే శక్తి ఉపాధ్యాయుల్లో ఉందని మాసాయిపేట ఎంఈఓ లీలావతి అన్నారు. మండల, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సోమవారం మాసాయిపేట ఉన్నత పాఠశాలలో ఎంఈఓ, తపస్ ఆధ్వర్యంలో వేర్వేరుగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులని, వారు ప్రతిరోజూ విద్యార్థులకు కొత్త విషయాలు బోధిస్తారని తెలిపారు. ఉపాధ్యాయులుగా చక్కగా పనిచేసి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజానికి దిక్సూచి లాంటి ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మధుసూదన్ రావ్, తపస్ జిల్లా బాధ్యుడు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ మండలంలోని ఆయా పాఠశాలలో పనిచేస్తున్న 40 మందిని ఉత్తమ ఉపాధ్యాయులను సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మధులత, ఎంఈఓ తారా సింగ్ పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించేందుకు జ్ఞాపికలు, శాలువలను అద్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవిరాజ్ సొంత నిధులతో తీసుకురావడం అభినందనీయమని ఎంపీడీఓ, ఎంఈఓ అభినందించారు.

ఉపాధ్యాయులు మార్గదర్శకులు

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల కేంద్రంలో సోమవారం సబ్ మార్కెట్ యార్డులో ఎంఈఓ యాదగిరి ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. నిజాంపేట మండలం 13 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం గొప్ప బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

22 మంది టీచర్లకు సన్మానం

రామాయంపేట(మెదక్): స్థానిక ఎంపీపీ కార్యాలయంలో 22 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఎంఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. తహసీల్దార్ రజనీ మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అవసరమని పేర్కొన్నారు. ఎంపీడీవో సజీలుద్దీన్, సహకార సంఘం చైర్మన్ చంద్రం, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట జెడ్పీ పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించారు. చందంపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు నవిత జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపిక కాగా సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమెను సత్కరించారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ నారాయణగౌడ్, మాజీ సర్పంచ్ శ్రీలతస్వామిరాజ్, జెడ్పీ పాఠశాల హెచ్‌ఎంలు శ్రీనివాస్‌గౌడ్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

బాధ్యతగా పనిచేస్తేనే గుర్తింపు

అల్లాదుర్గం(మెదక్): బాధ్యతగా పనిచేసి గుర్తింపు తెచ్చుకోవాలని ఎంఈఓ ధనుంజయ అన్నారు. మండల కేంద్రమైన అల్లాదుర్గంలో సోమవారం జూనియర్ కళాశాలలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పని చేస్తేనే మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాసాయిపేట ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం


నిజాంపేట(మెదక్): నిజాంపేటలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం


చిన్నశంకరంపేట(మెదక్): ఉపాధ్యాయురాలు మమతను సన్మానిస్తున్న అధికారులు


అల్లాదుర్గం(మెదక్): ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానిస్తున్న దృశ్యం

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌రావు


చిట్టోజిపల్లిలో మాట్లాడుతున్న సుదర్శన్‌రావు

చేగుంట(తూప్రాన్): పంటనష్టంతో ఇబ్బందులు పడుతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌రావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చిట్టోజిపల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులు పంటపొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌రావు మాట్లాడుతూ.. జిల్లాలో అకాల వర్షంతో వేలాది ఎకరాల్లో పంట నష్టం సంభవించినట్లు పేర్కొన్నారు. అధికారులు గ్రామాల్లో సందర్శించి పంట నష్ట బాధితులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు మల్లేశం, శోభన్, చేగుంట మండల రైతు సంఘం నాయకులు భాస్కర్, దివాకర్, రమేశ్, సత్యనారాయణ, పోచయ్య, సాయికుమార్, స్వామి పాల్గొన్నారు.

మార్షల్‌ఆర్ట్స్ ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సిందే

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రస్తుత పరిస్థితుల్లో మార్షల్ ఆర్ట్స్ ప్రతి నేర్చుకోవాల్సిందేనని ఎస్‌ఐ నర్సింహులు అన్నారు. సోమవారం చిలప్‌చెడ్ రైతువేదికలో 69వ అండర్ –17 ఉషూ (మార్సల్ ఆర్ట్స్)ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి పోటీలు ఉషూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పూర్ణచందర్, సెక్రటరీ పోచయ్య ఆధ్వర్యంలో నిర్వహించగా, ఎస్‌ఐ నర్సింహులు, అజ్జమర్రి మాజీ సర్పంచ్ పరుశరాంరెడ్డి ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ పోటీల్లో 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్ణచందర్ మాట్లాడుతూ ఉషూ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటలకు ఎంపిక చేస్తామన్నారు. ఎస్‌ఐ మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీలు చిలప్‌చెడ్ మండలంలో నిర్వహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రశాంత్, ఏపీఓ శ్యామ్, పీడీ విజేత, కరాటే మాస్టార్లు వినోద్, సాజిద్, లక్ష్మణ్, రాజుయాదవ్, సద్దాం, మహేస్‌గౌడ్, రాములు, మురళి, నవీన్, రాజు పాల్గొన్నారు.


ఉషూ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ, తదితరులు

ఎల్లుగుట్ట మట్టిరోడ్డుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలం ఫైజాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్లుగుట్ట తండా మట్టి రోడ్డుకు సోమవారం తాత్కలిక మరమ్మతులు చేయించామని పంచాయతీ కార్యదర్శి నాగరాజు అన్నారు. ఎల్లుగుట్టకు వెళ్లేందుకు ఉన్న ఏకైక మట్టి రోడ్డు కురిసిన వర్షాలకు కోతలకు గురైన విషయం విదితమే. ।దారి బాగులేక.. అంబులెన్స్ రాలేక, అన్న కథనం సాక్షిలో ప్రచురితం కావడంతో, స్పందించిన అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయించారు. కాగా తమకు శాశ్వత పరిష్కారం జరగాలని, ఫైజాబాద్ గేటు నుండి ఎల్లుగుట్ట తండావరకు పర్మినెంట్ రోడ్డు వేయించాలని ఎల్లుగుట్ట తండావాసులు కోరారు.


ఎల్లుగుట్ట రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

అభ్యంతరాలుంటే చెప్పండి

అఖిలపక్ష నేతలతో ఎంపీడీఓ

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాలలో వార్డుల వారీగా ఓటరు జాబితా సిద్ధం చేశామని, ఆ జాబితాలో మార్పులకు సంబంధించిన ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని, ఎంపీడీఓ ప్రశాంత్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఓటరు జాబితా అభ్యంతరాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఆరు ఎంపీటీసీ స్థానాలకు గానూ 17,640 ఓటర్లు ఉన్నాయన్నారు. తుది జాబితా ఎంపీడీఓ కార్యాలయంలో, అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఉంచామన్నారు. కాగా నాయకులు మాట్లాడుతూ పలు గ్రామాలలో మృతి చెందిన వారి ఓటును తొలగించలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. దానికి ఎంపీడీఓ వివరణ ఇస్తూ ఓటు తొలగించడం, కొత్త ఓటును చేర్చే అధికారం తమకు లేదన్నారు.

తప్పులు ఉంటే సరి చేసుకోండి

అల్లాదుర్గం(మెదక్): ఓటరు జాబితాలో తప్పులు ఉంటే సరి చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయా రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ స్థానాల వారీగా ఓటరు జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబితాలో అభ్యంతరాలు ఉంటే సరి చేస్తామన్నారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సదానందం, జెమినీ బాయి, బీజేపీ నాయకులు రాములు, సా యిలు, బీఆర్‌ఎస్ నాయకులు రమేష్ పాల్గొన్నారు.


చిలప్‌చెడ్: మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రశాంత్

ఓటరు జాబితాపై సమావేశం

చిన్నశంకరంపేట(మెదక్): మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రదర్శించిన ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ దామోదర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మోహన్‌నాయక్, బీజేపీ మండల అధ్యక్షుడు రాజు, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్ పాల్గొని అభిప్రాయాలను తెలిపారు.

నార్సింగిలో...

నార్సింగి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజకీయ పార్టీల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రాజేష్, శ్రీధర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, లింగారెడ్డి, బాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాబు పాల్గొన్నారు.

కొత్తకుంట తూము వద్ద బుంగ

నర్సాపూర్ రూరల్: మండలంలోని నారాయణపూర్ కొత్త కుంట తూము వద్ద బుంగ ఏర్పడి నీరు వృథాగా పోతోంది. ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి కొత్త కుంట తూము వద్ద ఏర్పడిన బుంగకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ శాఖ మణిభూషణ్‌ను వివరణ కోరగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.


తూము వద్ద బుంగ ఏర్పడి వృథాగా పోతున్న నీరు

రేషన్ బియ్యం పట్టివేత

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నందిగామలో సోమవారం బుడగ జంగాల కాలనీ వద్ద ఇస్తారి అనే వ్యక్తి తన టాటాఎస్ వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. వాహనంలో 6 క్వింటాలన్నర రేషన్ బియ్యం ఉన్నట్లు ఎస్‌ఐ రాజేశ్ తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ హెచ్చరించారు.

రవిబాబుకు అవార్డు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని చేగుంట మోడల్ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న డాక్టర్ రవిబాబుకు వెల్‌రెడ్ ఫౌండేషన్ సంస్థ సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ఎడ్యుకేషన్ అవార్డును అందించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సన్మాన కార్యక్రమంలో వెల్‌రెడ్ ఫౌండేషన్ సంస్థ రవిబాబుకు ప్రశంసా పత్రంతో పాటు సన్మానించినట్లు ప్రిన్సిపాల్ చంద్రకళ తెలిపారు. రవిబాబుకు అవార్డు రావడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ అభ్యంతరాలుంటే చెప్పండి

కొల్చారం(నర్సాపూర్): ఎంపీటీసీ ఎన్నికలపై సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీఓ రఫీకున్నీసా అధ్యక్షతన అఖిలపక్షం సమావేశం జరిగింది. ఓటరు జాబితాలో మార్పులు, పోలింగ్ కేంద్రాల మార్పులు చేర్పుల అభ్యంతరాలపై ఈ సమావేశంలో పార్టీల నాయకులతో చర్చించారు.అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ కష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

◆ జెడ్పీ పాఠశాలలో సీసీ కెమెరాలు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎస్‌ఐ నారాయణగౌడ్ ప్రారంభించారు. సోమవారం జెడ్పీ పాఠశాలలో తాజామాజీ సర్పంచ్ శ్రీలత సొంత ఖర్చులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శ్రీలతను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.